www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం జూన్ 30 2024
5
చిత్తూరు

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీపై జిల్లా కలెక్టర్‌గా వచ్చిన సుమిత్ కుమార్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో పోలీసు వ్యవస్థ చేపడుతున్న కార్యక్రమాలు నూతన చట్టాలపై కలెక్టర్‌తో ఎస్పీ చర్చించారు.

ఈవీఎం, వీవీ ప్యాట్లకు

కట్టుదిట్టమైన భద్రత

గోదామును తనిఖీ చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్

ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీప్యాట్ గోదాము భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం చిత్తూరు కలెక్టరేట్‌లోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్ రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతకు చేసిన ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మూడు నెలలకోసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో శనివారం వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి గోదామును త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నిశితంగా పరిశీలించినట్లు వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తతతో వుండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీ ప్రక్రియలో డీఆర్ఓ బి.పుల్లయ్య, రాజకీయ పార్టీలప్రతినిధులు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి పరదేశి, టిడిపి సురేంద్ర కుమార్, బిజెపి అట్లూరి శ్రీనివాసులు, సిపిఎం వాడ గంగరాజు, వైసిపి ఉదయ్ కుమార్,ఎలక్షన్స్ సెల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1న ఇంటి వద్దనే పింఛన్లు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సన్నద్ధం
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
ఎన్టీఆర్ భరోసా పథకం కింద జిల్లాలో పింఛన్ల పంపిణీకి అన్నివిధాలా సన్నద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శనివారం వెలగపూడి, ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుంచి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డీఆర్డీఏ పిడి తులసి, ఎల్‌డిఎం హరీష్ పాల్గొన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని, ఇందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకటో తేదీనే 100శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి కావాలని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ఖచ్చితంగా పెన్షన్ల పంపిణీ మొదలు కావాలని ఆదేశించారు. మండల, నియోజకవర్గ అధికారులు పింఛన్ల పంపిణీని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీ కోసం బ్యాంకుల నుంచి అవసరమైన నగదు పూర్తిగా విత్ డ్రా చేసుకుని పాయింట్ పర్సన్‌లకు అప్పగించాలన్నారు. పెన్షన్ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, జిల్లాలో సజావుగా, విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి: కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలోని పింఛను లబ్ధిదారులకు జూలై 1వ తేదీ సోమవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వారి ఇంటి వద్దనే పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. నగరపాలక పరిధిలోని 50 వార్డుల పరిధిలో పింఛన్ల పంపిణీకి సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నగర పరిధిలో మొత్తం 16,536 మందికి పెన్షన్ల పంపిణీ చేయడానికి 860 క్లస్టర్స్ ఏర్పాటు చేసి 350 మంది వార్డు కార్యదర్శులను మ్యాపింగ్ చేసినట్లు వివరించారు. 16,536 మందికి రూ.11,31,76,000లను లబ్ధిదారుల ఇంటి వద్దనే అందించనున్నట్లు చెప్పారు. పింఛన్ల పంపిణీ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

టమోటా ధరల నియంత్రణ

- ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా విక్రయం
- రైతు బజార్లో నాణ్యమైన కందిపప్పు కిలో రూ.165: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో పెనుమూరు, కార్వేటినగరం, జీడి నెల్లూరు, నగరి మండలాలలో టమోటా ధరలను నియంత్రణ చేయుటకు ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా తక్కువధరలకు విక్రయం చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలను నియంత్రించుటకు ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఓపెన్ మార్కెట్‌లో పెరుగుతున్న టమోటా ధరలను నియంత్రణ చేయుటకు ప్రత్యేక మొబైల్ వాహనాల ద్వారా తక్కువ ధరలకు పెనుమూరు, కార్వేటినగరం, జీడి నెల్లూరు, నగరి మండలాల్లో విక్రయించేందుకు చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ ఏడిని జేసీ ఆదేశించారు. అలాగే కందిపప్పు ధరల నియంత్రణ కొరకు చిత్తూరు రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి నాణ్యమైన కందిపప్పు కేజీ రూ.165లకు విక్రయించేలాగా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, చిత్తూరు, ఏడి మార్కెటింగ్ వారిని ఆదేశించారు. ఈ ప్రత్యేక కౌంటర్‌లను మంగళవారం రైతుబజార్‌లో ప్రారంభించేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పప్పుధాన్యాల హోల్‌సేల్ డీలర్లు ప్రత్యేక కౌంటర్‌ల ఏర్పాటును పాత మార్కెట్ వీధిలో కూడా ఏర్పాటు చేయవలసినదిగా తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శంకరన్, డిఎం సివిల్ సప్లై మోహన్ బాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఎడి మార్కెటింగ్ పరమేశ్వరన్, హోల్‌సేల్ డీలర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

టీటీడీ ఆన్లైన్ అప్లికేషన్లకు

ఆధార్ అనుసంధానం : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న ఆన్లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్‌ను లింక్ చేయడం ద్వారా పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు వీలవుతుందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో శనివారం యుఐడిఎఐ (ఆధార్ సంస్థ) నుండి విచ్చేసిన అధికారులు, టిసిఎస్ జియో, టీటీడీ ఐటి విభాగంతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఇదివరకే టీటీడీ దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ తదితర సేవలను ఆన్లైన్ ద్వారా భక్తులు బుక్ చేసుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు. అయితే ఈ అప్లికేషన్ల ద్వారా కూడా దళారుల బెడద తప్పడం లేదని, వాటిని నియంత్రించడానికి ఆధార్ లింక్ చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఐటి అధికారులను ఈవో ఆదేశించారు. ఇందుకు సంబంధించి యుఐడిఎఐ అధికారుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఆధార్ ద్వారా యాత్రికుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఎలా చేయాలి, ఆధార్ డూప్లికేషన్ ఎలా నిరోధించాలి తదితర అంశాలపై ఆయన చర్చించారు. అంతకుముందు యుఐడిఎఐ అధికారులు ఆధార్ ను ఏ విధంగా అప్లికేషన్ లకు లింక్ చేయవచ్చు, తదితరాంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత, అధికారులు శ్రీనివాస్, రాజశ్రీ గోపాలకష్ణ, అనుకూర చౌదరి, సంజీవ్ యాదవ్, టీటీడీ జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, రవాణా విభాగం జనరల్ మేనేజర్ శేషారెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ ఈవోగా ఎస్వీఎస్ఎన్ మూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి
శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా ఎస్వీఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ శనివారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్వీఎస్ఎన్ మూర్తి ప్రస్తుతం దేవదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనరుగా పని చేస్తున్నారు. ఈయనకు ఆర్జేసీతో పాటు ముక్కంటి ఆలయ ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ముక్కంటి ఆలయ ఈవోగా పని చేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే. ఆలయ బాధ్యతలను ఎస్వీఎస్ఎన్ మూర్తికి అప్పగించాలని ఎస్వీ నాగేశ్వరరావుకు దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఆదేశించారు. కమిషనరు ఉత్తర్వులతో ముక్కంటి ఆలయ ఈవో ఎవరనే ఉత్కంఠకు తెరపడింది.

శ్రీవారి లడ్డు నాణ్యత పెంచడానికి చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ
శ్రీవారి లడ్డు ప్రసాదాలు మరింత రుచిగా, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో జె. శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డెయిరీ నిపుణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మరింత నాణ్యమైన నెయ్యిని ఎలా కొనుగోలు చేయాలి, కొనుగోలు చేసిన నెయ్యిని ప్రస్తుతం పరీక్షిస్తున్న విధంగా కాకుండా మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై, అందుకు తీసుకోవలసిన మార్పులను తెలియజేయాలని ఆయన నిపుణులను కోరారు. తరువాత ప్రముఖ డెయిరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ లడ్డు నాణ్యత పెంచేందుకు ఎస్-ఎస్ఐ నిబంధనల ప్రకారం నాణ్యమైన నెయ్యిని ఎలా తయారు చేస్తున్నారు, ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా అగ్ మార్క్, నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనే విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారు వివరించారు. ఈ సమావేశంలో జెఈఓ గౌతమి, ఎస్వి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి, కొనుగోలు జిఎం మురళీకష్ణ, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నూతన బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ చిత్తూరు టు డిపో నుండి చిత్తూరు - బెంగళూరు, చిత్తూరు- తిరుపతి నూతన బస్సు సర్వీసులను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శనివారం ప్రారంభించారు. స్వయంగా ఎమ్మెల్యే నూతన బస్సులను నడిపి ఆర్టీసీ కార్మికులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు టు డిపో నుండి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రెండు నూతన బస్సులను నడపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏపీఎస ఆర్టీసీ అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్మోహన్ ప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చిత్తూరు నుంచి కొన్ని సర్వీస్‌లకు బస్సులు నడపడంతో పాటు చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఆర్టీసీ బస్టాండు నిర్వహణ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. బస్టాండ్ ఆవరణంలో ఆహార పదార్థాలు అధిక రేట్లకు అమ్మడాన్ని అరికట్టి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన వైసిపి నాయకుడి కాలంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని బస్టాండ్‌లోని రోడ్లే నిదర్శనమన్నారు. ఎన్నికల హామీ మేరకు మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, టిడిపి నాయకులు, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు కార్మికులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీని శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 1962లో చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం జరిగిందని, అనేక కారణాలతో పది సంవత్సరాలుగా షుగర్ ఫ్యాక్టరీ మూత పడిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించి చెరకు రైతులకు, కార్మికులకు న్యాయం చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోనున్నట్లు చెప్పారు. షుగర్ ఫ్యాక్టరీ ఉన్న స్థలంలో ప్రత్యామ్నాయ ఫ్యాక్టరీ ఏర్పాటు, షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి ఉన్న అవకాశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షుగర్ కేన్ కమిషనర్ జాన్ విక్టర్, రైతు సంఘం నాయకులు హరిబాబు, పూర్వకార్మికులు పాల్గొన్నారు.

ర్యాంకు సాధించిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అభినందించారు. నగరి కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బికాం జనరల్‌లో మూడవ సంవత్సరం చదువుతున్న ఎంవి గోపి రాష్ట్రస్థాయిలో 49వ ర్యాంకు, జి.భాస్కర్ 55వ ర్యాంకు, మహేష్ 148వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో టి.నందకుమార్ 23వ ర్యాంకు, సి.తిరుమలయ్య 196వ ర్యాంకు సాధించారన్నారు. లాసెట్ ప్రవేశ పరీక్షలో డి.మీనాక్షి, డి.మునిరూబిని, టి.తిరుమలయ్యలకు ఉత్తమ ర్యాంకులు వచ్చాయన్నారు. 16మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో అర్హత సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. నగరి కళాశాలలోని బికాం కంప్యూటర్స్ ఫైనాన్స్, బిబిఏ డిగ్రీలో పాటు పీజీ ఎంకాం కోర్సు, పీహెచ్‌డీ రీసెర్చ్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పిడి రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పథక సంచాలకులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ చిత్తూరు వారు ఐరాల మండలం ముదిగుల్లం గ్రామపంచాయతీలో సప్లై ఛానల్ కొత్తపల్లె గ్రామపంచాయతీలో పెర్క్యులేషన్ ట్యాంక్ పూడిక తీత పనులను డ్వామా పిడి ఎన్.రాజశేఖర్ శనివారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డ్వామా పిడి మాట్లాడుతూ పనుల వద్ద ఉపాధి హామీ వేతనదారులతోపై తెలిపిన పనులు చేయడం వలన భూగర్భ జలాలు పెరుగుతుందని, తదుపరి ఉపాధి హామీ వేతనదారులతో మీరు పనిచేసిన దానికి సక్రమంగా వేతనాలు వస్తున్నాయా లేదా అని అడుగగా అందుతున్నాయని ఉపాధి హామీ వేతనదారులు సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. పనుల తనిఖీలో భాగంగా ప్రతి క్షేత్ర సహాయకుడు కూడా గ్రామపంచాయతీ నుంచి కూలీలను సమీకరించి మండలంలో సోమవారం నుంచి వేలమంది పని చేయవలెనని, సరాసరి సగటు వేతనం కూడా ప్రతి గ్రామ పంచాయతీలో కూడా 275 రూపాయలు తగ్గకుండా రావాలని, క్షేత్ర సహాయకులు సక్రమంగా పని చేయకుండా పని దినాలు పెంచని వారి పైన తగుచర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి, ఈసి శరత్ బాబు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఉచిత న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:
నిర్లక్ష్యం, కోపతాపాలు కుటుంబంలో ఉండకూడదని, ప్రేమనమ్మకం మాత్రమే ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక జిల్లా కోర్టులో పోక్స్ కోర్టు జిల్లా జడ్జి శాంతి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, అదనపు సివిల్ జడ్జి ఎస్‌పిడి, వెన్నెల, బార్ అసోషియేషన్ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి, సెక్రటరీ అశోక్ యాదవ్, విశ్రాంత జడ్జి రమేష్‌లతో కలసి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు జిల్లాలో నేడు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటుగా 13 మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలోని తిరుపతి, మదనపల్లి, శ్రీకాళహస్తి, పీలేరు, పుత్తూరు, పుంగనూరు, పలమనేరు, పాకాల, కుప్పం, వాల్మీకిపురం, సత్యవేడు, నగరి, తంబళ్లపల్లి కోర్టులలో ఏర్పాటు చేసిన 34 బెంచ్‌లు ద్వారా కేసులు పరిష్కరం చేయుటకు ముందుగానే 11,868 కేసులను గుర్తించడం జరిగిందన్నారు. ముందస్తుగానే ఫ్రీ లోక్ అదాలత్ బెంచ్‌ల ద్వారా మధ్యవర్తిత్వం జరిపి 233 కేసులు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. గత మార్చి నెలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 760 క్రిమినల్ కంపౌండబుల్, 41 ఎంఏసిటి కేసులు, 279 సివిల్ కేసులు కేసులు పరిష్కరించి రూ.43,20,18,660 కక్షదారులకు అందజేయడం, 91 ఫ్రీ లిటీగషన్ కేసులు పరిష్కరం చేసి కక్ష దారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. లోక్ అదాలత్‌లో భూ సమస్యలు, సివిల్, క్రిమినల్ కంపౌండబుల్, ఎన్ఐ యాక్ట్ కేసులు, ఎక్సైజ్, బ్యాంక్స్, ప్రైవేట్ చిట్‌ఫండ్ విద్యుత్, నీటి బిల్లు, బీమా సంస్థల, చెక్ బౌన్స్, రెవెన్యూ కేసులు, దొంగతనం కేసులు, యం.వి.ఐ, కుటుంబాలకు సంబంధించిన కేసులు పరిష్కరం చేసుకోవచ్చునని తెలిపారు. జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలని తెలిపారు. 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మాధవి, 3వ అదనపు సివిల్ జూనియర్ జడ్జి శ్రీనివాసు, జె.కీర్తన 5వ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్, న్యాయవాదులు జి.వెంకటపతి నాయుడు, మంజువాణి, నీలిమ, బాలాజీ, జాన్సీ జిల్లాన్యాయధికారులు, రెవెన్యూ పోలీసు, బ్యాంక్ అధికారులు కక్షదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

లోక్ అదాలత్‌లో 48 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 48 కేసులు పరిష్కారం కాగా రూ.48.12 లక్షలు సెటిల్‌మెంట్ అయింది. జడ్జి ఎస్.విష్ణువర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సివిల్, బ్యాంకు కేసులు విచారణకు వచ్చాయి. వీటిలో 48కేసులు పరిష్కారానికిగురై సెటిల్‌మెంట్ అయ్యాయి. లోక్‌అదాలత్‌లో ఏపీపీ రామశాంతి, బార్ ప్రెసిడెంట్ జగదీష్, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



పలమనేరులో 127 కేసులు పరిష్కారం

పలమనేరు: పట్టణంలోని జవలివీధిలోగల సీనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 127 కేసులు పరిష్కారం అయినట్లు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పగటాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సివిల్ కేసులు 12, క్రిమినల్ కేసులు 58, బ్యాకులకు సంబంధించి 57 కేసులు మొత్తం కలిపి 127 కేసులకు సంబంధించి రూ.57,90,046లు రికవరీ అయ్యాయని జడ్జి పేర్కొన్నారు.

టెక్నాలజీ, పర్యావరణంపై అవగాహన

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆధునిక బోధనోపకరణ వినియోగంపై పుత్తూరు సమీపంలో ఉన్న వెంకట పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ వారు శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ప్రధానోపాధ్యాయులు సిద్దయ్య తెలిపారు. గ్రూప్ లీడర్ కామసాని చంద్రవనిత ఆధ్వర్యంలో విద్యార్థులకు టెక్నాలజీతో పాటు పర్యావరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న ఈసీఈ విద్యార్థులు సామాజికసేవ ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.5లక్షలు ఆదాయం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో మూడు రాష్ట్రాల కూడలలో నెలకొని ఉన్న శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవాలను ప్రతి ఏటా జూలై మాసంలో బ్రహ్మాండంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ దేవాలయానికి సంబంధించిన వేలంపాటను శనివారం ఆలయ అధికారులు భక్తుల సమక్షంలో నిర్వహించారు. వేలపాటలో తల నీలాలు రూ.2లక్షలు, లడ్డులు రూ.5 లక్షల 10వేలు, అంగళ్ల గేటు రూ.లక్ష వెయ్యిరూపాయలకు పాటదారులు పాడుకున్నట్లు తెలిపారు. వేలంపాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయాభివృద్ధి ఉపయోగిస్తున్నట్లు వారు తెలిపారు.

'జ్ఞాన దీపాలు' పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- గంగవరం: జాయినింగ్ ది డాట్ సంయుక్తంగా ముదిరించిన జ్ఞానదీపాలు పుస్తకాలను శనివారం స్థానిక తెలుగు సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు మండలంలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాల్లోని విషయాలు పాఠశాల ప్రార్థన సమయంలో బోధించడానికి సామెతలు, నీతి పద్యాలు, సూక్తులు ఉంటాయని, ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- గంగవరం : మండలంలోని పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం బెంగళూరు వైట్ ఫీల్డ్ వైదేహి వైద్యశాలవారి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు స్థానిక డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 98 మంది పేషెంట్లకు వైద్య సేవలందించి, అందులో 9 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించి మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. మిగతా వారికి ఉచిత మందులు పంపిణీ చేసి వ్యాధిపై అవగాహన కలిగించినట్లు తెలిపారు. స్థానిక డాక్టర్ సర్దాజ్, వైదేహి ఆసుపత్రికి చెందిన డాక్టర్ కిరణ్, డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఛైర్మన్‌గా సమిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: 2024 -25 సంవత్సరానికి గాను లయన్స్ డిస్ట్రిక్ట్ 317ఈ రీజియన్ ఛైర్మన్‌గా సమిరెడ్డి రామచంద్రారెడ్డిని, డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్ర హెచ్ రెడ్డి నియమించడం జరిగిందని వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రారెడ్డి తిరుపతి టెంపుల్ టౌన్ అధ్యక్షులుగా, డిస్ట్రిక్ట్ జోన్ ఛైర్మన్‌గా ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా మంచి గుర్తింపు పొందడం వలన ప్రస్తుత గవర్నర్ చంద్ర హెచ్ రెడ్డి ఈ కీలకమైన పదవిలో కూర్చోబెట్టడం జరిగింది. నగరి, పుత్తూరు, తిరుపతి, పాకాల సమీపంలోని 11 లయన్స్ క్లబ్బులకు ఇన్‌ఛార్జిగా కూడా వ్యవహరించనున్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతగా నిర్వర్తిస్తానని రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన గవర్నర్ చంద్రహెచ్ రెడ్డి, మెంబర్స్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళా కార్యకర్త మృతికి నివాళులు

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని కంబాలదేవులపల్లి గ్రామానికి చెందిన మహిళా కార్యకర్త మంజుల శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. టిడిపి నేతలు కార్యకర్తలు ఆమె భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధికి, సభ్యత్వ నమోదుకు ఆమె ఎంతో కృషి చేసిందని కొనియాడారు. నివాళులు అర్పించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి, వెంకటరమణ, జ్ఞానశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు

టిడిపి శ్రేణులకు సన్మానం..!

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రంలోని మక్కా మసీదులో ముస్లిం సోదరులు శనివారం టిడిపి శ్రేణులను ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఘన విజయం సాధించడంతో పార్టీ శ్రేణులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మండలంలో అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని ముస్లిం సోదరులు ఆకాంక్షించారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, సలాం సాబ్, రఫీ, నియాజ్, విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేదల భూముల జోలికొస్తే సహించబోం

ఫారెస్టు అధికారులకు సిపిఎం హెచ్చరిక

ప్రజాశక్తి - వెంకటగిరి

పేదల భూముల జోలికొస్తే సహించబోమని ఫారెస్టు అధికారులను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు హెచ్చరించారు. వెంకటగిరి మండలం పెట్లూరు రెవెన్యూ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు చెందిన నిరుపేదలు గత 30 సంవత్సరాలుగా సర్వే నంబర్ 12, 23లలో భూమిని సాగు చేసుకుంటున్నారు. అక్కడే గుడిసెలు వేసుకుని నివాసాలు ఉంటున్నారు. ఏరియాలో శనివారం జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో పేదలను ఉద్దేశించి వి.నాగరాజు మాట్లాడుతూ ఫారెస్టు అధికారులకు సదరు భూమిపై ఎటువంటి హక్కు లేనప్పటికీ గ్రామస్తులపై చట్టవిరుద్ధంగా దౌర్జన్యానికి పూనుకుంటున్నారన్నారు. 2012 నుంచి ఫారెస్టు, రెవెన్యూ డిపార్టుమెంట్లు కలిసి జాయింట్ సర్వే నిర్వహించమని జిల్లా కలెక్టర్, గూడూరు సబ్ కలెక్టర్, వెంకటగిరి తహశీల్దార్ పలు దఫాలు ఫారెస్టు అధికారులకు రాతపూర్వకంగా తెలియజేసినప్పటికీ వారు సహకరించలేదన్నారు. జూన్ 24న పేదలపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజి ఆఫీసర్ నోటీసులు పంపారన్నారు. ఈ భూములపై ఎటువంటి అధికారం లేకపోయినా గ్రామస్తులపై చట్ట విరుద్ధంగా దౌర్జన్యానికి పాల్పడుతున్న ఫారెస్టు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ అధికారంలో పేదలపై కేసులు నమోదు చేస్తారని ప్రశ్నించారు. పేదలు సాగు

చేస్తున్న ఈ భూమిలోనే ప్రభుత్వం కేటాయించి ఉన్న ఇంటి స్థలాలు, రైతు భరోసా కేంద్రం, ఆస్పత్రి ఉన్నాయని తెలిపారు. ఇదే భూమిలో కొందరు రైతులకు పట్టాలు ఇచ్చారన్నారు. వాస్తవాలను మరుగునపరచి ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదారి పట్టించేలా ఫారెస్టు అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. తిరుపతి జిల్లా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ పేదలు జానెడు స్థలంలో గుడిసె వేసుకుంటే ఫారెస్టువారు తరిమికొట్టేలా దౌర్జన్యం చేస్తూ రాజకీయ, ధనబలంతో అడ్డుకుంటున్నారన్నారు. పేదలపై దౌర్జన్యం చేస్తే ఊరుకునేది లేదన్నారు. పేదలకు అండగా సిపిఎం, రైతుసంఘం, వ్యవసాయకార్మిక సంఘం ఉంటాయన్నారు. సిపిఎం నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చేజర్ల రమణయ్య, దొరబాబు, వెంకట రమణయ్య, నాగమణి, రత్నమ్మ, సుబ్బమ్మ, రాజమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

పేదలకు రేషన్ సక్రమంగా అందించాలి: ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రేషన్ డీలర్ల సమస్యల్ని పరిష్కరించేందుకు తన వంతు కషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. గత ఐదేళ్లలో రేషన్ డీలర్లు పలు సమస్యల్ని ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. తిరుమల తిరుపతి రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానించిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు రేషన్ సక్రమంగా అందించాలన్నారు. రేషన్ డీలర్ల కమిషన్ పెంపు, డీలర్ లకే లాగిన్ అవకాశం కల్పించే అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు సోమశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్, గిరిబాబు, నాగరాజ శెట్టి, డిటీ సురేంద్ర, టిడిపి కార్పొరేటర్ ఆర్సీ మునికష్ణ పాల్గొన్నారు.

పలువురు ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి ప్రజా రవాణా విభాగంలో వివిధ హోదాలలో పనిచేస్తూ ఈ నెల చివరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నలుగురు ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్ రెడ్డి విశిష్ట అతిథిగా విచ్చేసి కొనియాడారు. రమేష్, అసిస్టెంట్ మేనేజర్ ఫైనాన్స్, పీసీ బాబు సూపరింటెండెంట్ పర్సనల్, వీఆర్వో బి. కష్ణ రెడ్డి, టీటీఐ బి మణి ఉద్యోగ విరమణ సందర్భంగా పలువురు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు ఎం భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సిఎంఈ జి. నరసింహులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- సోమల: మండలం ఆవులపల్లి పంచాయతీలోని పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి మణికుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అతిసార వ్యాధి నివారణలో భాగంగా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం, మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం తొలగించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం లక్ష్యంగా ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి పైపులైన్ల లీకేజీలను అరికట్టి ప్రజలకు తాగునీరును సరఫరా చేస్తున్నామని తెలిపారు.

'మఠాలను టిటిడి ప్రక్షాళన చేయాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గోవింద నామ స్మరణతో మారుమోగే తిరుమలలో ఉన్న మఠాలను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ప్రక్షాళన చేయాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ డిమాండ్ చేస్తోందని శ్రీ ఆనందాశ్రమ పీఠాధిపతులు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివిధ పీఠాధిపతులతో కలిసి మాట్లాడారు. తిరుమలలోని మఠాల్లో మఠాధిపతులు మాత్రమే ఉండాలని, అలా కాకుండా మఠాల నిర్వాహకులు ముఠాలుగా ఏర్పడి తిరుమలకు వచ్చే భక్తులను నిలువునా దోచుకుంటున్నారని, పెళ్లిళ్ల పేరుతో తిరుమలలో భక్తుల నుండి స్వామివారికి చెందాల్సిన ధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మ్యారేజ్ కాంట్రాక్టర్స్ గా అవతారం ఎత్తిన రాఘవేంద్ర, రామారావు అనే వ్యక్తులు మఠాలను అడ్డుపెట్టుకొని అందులో పెళ్లిళ్లు చేయిస్తూ కోట్లు వెనకేసారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలతో ప్రక్షాళన చేస్తానని చెప్పి ఈవోను మార్చారని, ఒక్క ఈవో మార్పుతో ప్రక్షాళన సాధ్యపడదని, ఇంకా గత ప్రభుత్వ మత్తులో ఉన్న అధికారులను తొలగించి పూర్తిగా ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలలో నిబంధనలను అతిక్రమించి వాగు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేసిన విశాఖ శారదా పీఠాన్ని తక్షణమే సీజ్ చేయాలని, భక్తుల భద్రత దష్ట్యా టిటిడి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలి : జెవివి

ప్రజాశక్తి -రేణిగుంట

రేణిగుంట బిసి హాస్టల్ సమస్యలపై రేణిగుంట మండల విద్యాశాఖాధికారి రంగనాదయ్య , మండల అభివద్ధి అధికారి విష్ణు చిరంజీవిలకు జనవిజ్ఞాన వేదిక నాయకులు కుప్పస్వామి, వెంకట రమణలు వినతి పత్రం అందజేసారు. పరిష్కారానికి కషి చేస్తామని ఎంఈఓ రంగనాదయ్య తెలిపారు. రేణిగుంట బిసి హాస్టల్లో లెట్రిన్ సంప్ నిండి పోయి చాలా కాలం అయ్యింది. అందు వల్ల పిల్లలు మూత్ర విసర్జనకు బయటకు వెళ్ళవలసి వస్తోందని చెప్పడంతో ప్రత్యేక చొరవ చూపినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రేణిగుంట హాస్టల్‌కు పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాలని, ట్యూటర్లను నియమించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని, కిటికీలు, తలుపులు, లైట్లు, ఫ్యాన్లు స్విచ్చులు

మరమ్మతు చేయాలని కోరారు. ఫిల్టర్ వాటర్ రిపేర్ చేయాలన్నారు. పంచాయతీ నీటికొళాయి కనెక్షన్ ఇప్పించాలన్నారు. పాములు తరచూ హాస్టల్లోనికి వస్తున్నాయని, వీధిలైట్లు వేయించాలన్నారు. సిబ్బందిని నియమించి విద్యార్థుల చదువులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కాల్వలపై ఆక్రమణలు తొలగించాలి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని కాలువలపై ఆక్రమణలను తొలగించి పూడిక తీసే పనులు వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ ఐఏఎస్ ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి నగరంలోని వివి మహల్ రోడ్డు, భవానీ నగర్, రైల్వే కాలనీ, సాయిరామ్ వీధి ప్రాంతాల్లో శనివారం విస్తతంగా కమిషనర్ పర్యటించి శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. వివి మహల్ రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రధాన కాలువలపై ఆక్రమణలు తొలగించి, అటు తరువాత పూర్తి స్థాయిలో సిల్ట్ తొలగించి, ఎలాంటి ఆంటకాలు రాకుండా కాలువల్లోని మురికి నీరు ప్రవహించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. దేవేంధ్ర థియేటర్ పక్కన వెలుతున్న ప్రధాన కాలువలో కేబుల్ వైర్లు, ఇతర పైప్ లైన్లు మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా వుండడం

గమనించి, వాటినన్నింటిని క్రమబద్ధికరించి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ శ్రావణి, శానిటరి సూపర్ వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.

ఖాతాదారులకు డివిడెంట్లు అందిస్తాం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో ఉండే ఖాతాదారులు అందరికీ డివిడెంట్లు త్వరలో అందిస్తామని ఆ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్ ప్రకటించారు. శనివారం తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఆవరణంలో ఖాతాదారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్ రామారావు ఊర్లో లేకపోవడంతో వైస్ చైర్మన్ వాసు యాదవ్ ఇన్చార్జి చైర్మన్గా ఈ సమావేశానికి వ్యవహరించారు. ఆయన ఖాతాదారులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇస్తూ టౌన్ బ్యాంక్ పరిధిలో సుమారు 40 కోట్ల రూపాయలు మొండి బకాయిలు వసూలు చేయడంతో డివిడెంట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొండ బకాయలపైనే పనిచేయడం జరిగిందన్నారు. టౌన్ బ్యాంక్ చైర్మన్ వైస్ చైర్మన్ కార్యాలయాన్ని మద్యం బార్‌గా మార్చారని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు మహమ్మద్ ఖాసిం, అత్తూరు సురేష్ రెడ్డి ,వెంకటేష్ రాయల్, అనిల్ కుమార్ రాయల్, మబ్బునాదంరెడ్డి, బ్రహ్మానందంరెడ్డి, పి.నాగిరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

ప్రజాశక్తి -రామచంద్రాపురం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, పండించిన ఆహార ధాన్యాలను ఆహారంగా తీసుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకుందామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ప్రకతి వ్యవసాయం సాగు చేస్తున్న ఎస్సీ పేద రైతులకు తిరుపతి రూరల్ మండలం తనపల్లి సమీపంలోని రఘునాథ రిసార్ట్స్‌లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ప్లాస్టిక్ పట్టలు, డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకతి వ్యవసాయంను ప్రోత్సహించటమే లక్ష్యంగా పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం వలన ఆరోగ్యానికి హానికరం కావడంతో ప్రకతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా లభ్యమయ్యే ఆకులు, అలుములు పశువుల మూత్రం, పేడ, పుల్లటి మజ్జిగ, బెల్లం, మిరపకాయలు వంటి వాటితో ఘన, ద్రవ జీవామతాలను, కషాయాలను పెద్ద మొత్తంలో తయారు చేయడానికి డ్రమ్ములను ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. పండించే పంటలను నాణ్యతగా నూర్పిడి చేసుకోవడానికి ప్లాస్టిక్ పట్టలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలకు, ధాన్యానికి మంచి డిమాండ్ ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ జిల్లా పథక మేనేజర్ షణ్ముగం, వ్యవసాయ అధికారిణి మమత, అదనపు ప్రాజెక్టు మేనేజర్ పట్టాభి రెడ్డి, ప్రకతి వ్యవసాయం సిబ్బంది స్వామి కొండయ్య, శ్రీదేవి పాల్గొన్నారు.

అతిసారం, డయేరియా ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్:

అతిసారం, డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీన నీటి సరఫరా, పారిశుద్ధ్యం విభాగం ఎస్ఈ కె.విజయ కుమార్ అధికారులకు సూచించారు. శనివారం నగరి, నింద్ర, విజయపురం మండలాల్లోని ఆవాసాలలో తాగునీరు, పారిశుద్ధ్యం పనులను ఆయన పరిశీలించారు. అతిసారం, డయేరియా ప్రబలకుండా మంచినీటి సరఫరాకు జాగ్రత్తలు సూచించారు. ఎక్కడా పైప్ లైన్ లీకేజీ లేకుండా చూడాలన్నారు. నీటి సరఫరా ట్యాంక్‌లు, పైప్ లైన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. రక్షిత నీటి సరఫరా ట్యాంకులు విధిగా 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలని సూచించారు. శుభ్రపరిచిన తేదీ, తదుపరి శుభ్రపరుచు తేదీని ట్యాంక్ వద్ద ప్రదర్శించాలన్నారు. ట్యాంక్ నింపిన ప్రతి సారి క్లోరినేషన్ చేయాలన్నారు. క్లోరినేషన్ మోతాదు 0.2 పీపీఎం మించకుండా క్లోరోస్కోప్ ద్వారా పరీక్షించవలెను. తాగునీటి సమస్య ఎక్కడా రాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. డీఈఈ యంఆర్.సతీష్ కుమార్, ఏఈలు ఆర్.శైలేంద్ర, కె.అంజేరయ్య, కెవి.శ్రీకాంత్, విజయపురం మండల మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన అవసరం

మండల వైద్యాధికారి టి.మురళి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సీజనల్ వ్యాధుల, అంటువ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి టి.మురళి అన్నారు. శనివారం మండల పరిధిలోని రాజుపల్లి, శంకర్రాయలపేట గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్రాయల పేటలోని మహాత్మ జ్యోతిరావు బాపులే గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుంటూ వ్యక్తిగత శుభ్రత పాటించి, పరిసరాల పరిశుభ్రతను చక్కదిద్దాలన్నారు. అలాగే దోమల వల్ల వచ్చే జ్వరాలు ప్రాణాంతకం కావచ్చు అని వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని నీటినిలువ తొట్టెలను వారానికి ఒకసారి డ్రైడేగా పాటించి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

జీరియాట్రిక్ మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆయుష్ కమిషనర్ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు మంగళం ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ వైద్యాధికారిని ప్రసన్నలక్ష్మి, మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని జయంతి సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి కరకంబాడి మార్గంలోని తెలుగు తల్లి వద్ధాశ్రమంలో శనివారం జీరియాట్రిక్ మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ మెడికల్ క్యాంపు ద్వారా ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ పరిధిలోని వద్ధాశ్రమాలలో ఉన్న వయోవద్ధులకు బిపి, మధుమేహం, కీళ్ల నొప్పులు, ఆరోగ్య పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. జూలై 15వ తేదీ వరకు ఈ క్యాంపులు కొనసాగుతాయని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి రాజేశ్వరి, కాంపౌండర్ తారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరవలేనిది

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సంజయ్ గాంధీ కాలనీలోని నగర పాలక ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు కె.ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి 5వతరగతి విద్యార్థులకు ఉచితంగా రాత పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. రూ.35వేల విలువగల పెన్సిల్స్, రబ్బర్, బలపాలు మొదలగు విద్యా సామగ్రిని చంద్రగిరి మండలం, నడింపల్లి గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు దొండపాటి మునిశంకర్ నాయుడు, వారి కుమారుడు నిహాల్క కలిసి అందించారు. దాత మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన విద్యా సామగ్రిని సక్రమంగా వినియోగించుకుని ఉన్నత స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె బాలాజి , కే భాస్కర్ నాయక్ దాతలను అభినందించి సత్కరించారు. టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు శాంతమ్మ, తొమ్మిదో వార్డు మహిళా అధ్యక్షురాలు స్రవంతి, గోపాల్, మునస్వామి, ముని యాదవ్ పాల్గొన్నారు

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ